కార్యకర్తల భరోసా కోసమే డిజిటల్ బుక్

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- అధికారులు చట్టం ప్రకారం విధులు నిర్వర్తించాలని సూచన


జగనన్న డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నాయకులు

కల్లూరు: రెడ్‌బుక్ రాజ్యాంగంలో అన్యాయమైన కార్యకర్తలకు అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కార్యకర్తలకు భరోసా కోసమే వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ తీసుకొచ్చారని తెలిపారు. శనివారం తన స్వగృహంలో విలేకరులు సమావేశం నిర్వహించారు. అనంతరం డిజిటల్ బుక్ యాప్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలో చాలా మంది అన్యాయానికి గురయ్యారన్నారు. ఆరాచకాలను ఆపకుంటే వేధింపులకు పాల్పడిన వ్యక్తుల పేర్లు డిజిటల్ బుక్‌లో నమోదవుతాయన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక వైఎస్సార్‌సీపీ నాయకులపై హత్యలు, దాడులతో పాటు అక్రమ కేసులు పెడుతున్నారని తెలిపారు. పాణ్యం నియోజకవర్గంలోని ఓర్వకల్లు, గడివేముల, కల్లూరు మండల్లోని కూటమి నేతలు చెప్పారని పోలీసులు అక్రమ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. తప్పు చేసిన వారిని శిక్షించాలని, అలా కాకుండా కూటమి నేతల మెప్పు కోసం అక్రమ కేసులు నమోదు చేయడం సబబు కాదన్నారు. పోలీసు అధికారులు కూటమి నేతలు చెప్పినట్లుగా కాకుండా విచారించి తప్పు చేసిన వారు అధికార పార్టీ నాయకులైనా, ప్రతిపక్ష నాయకులైనా చర్యలు తీసుకోవాలన్నారు. అలా కాకుండా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అన్యాయంగా, అక్రమంగా కేసులు నమోదు చేస్తే తమ పార్టీ అధికారంలోకి వచ్చాక తప్పకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎక్కడైనా అన్యాయం జరిగితే ఆ సంఘటనలను డిజిటల్ బుక్‌లో నమోదు చేసుకోవాలన్నారు. రెడ్‌బుక్‌కు ధీటుగా డిజిటల్ బుక్ పని చేస్తుందన్నారు. పోలీసు, రెవెన్యూ, ఇతర అధికారులు తమ ఉద్యోగ ధర్మాన్ని సజావుగా నిర్వర్తించాలన్నారు. అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రజలకు మంచి పాలన అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, కల్లూరు ఎంపీపీ శారద, ఓర్వకల్లు జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్ గౌడ్, నాయకులు హనుమంతురెడ్డి, కేవీ రమణారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, తిరుపాల్, సుంకన్న, శివారెడ్డి, ఉలిందకొండ రమణారెడ్డి, పెద్దన్న, పార్టీ మండలాధ్యక్షులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


కాటసాని రాంభూపాల్ రెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కల్లూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో వివిధ విభాగాల్లో పదవులు పొందిన వారందరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ సెక్రటరీగా నియమితులైన ఎం. పెద్దన్న శనివారం కాటసానిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. కష్టపడే వారికి తప్పనిసరిగా పదవులు వరిస్తాయన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్పొరేటర్ నరసింహులు, నాయకులు రంగప్ప, సుధాకర్, కాశన్న, భాస్కర్, రమేష్, అంజి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో, మినీట్రాలీ

పాణ్యం: మినీ ట్రాలీ టైర్ పేలడంతో అదుపు తప్పి ఆటోను ఢీకొన్న ఘటన మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామం వద్ద శనివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడినట్లు హైవే పెట్రోల్ సిబ్బంది తెలిపారు. వారి వివరాల మేరకు.. తమ్మరాజుపల్లె గ్రామానికి చెందిన లక్ష్మీరెడ్డి ఆటోలో కూలీలను వదిలిపెట్టి రోడ్డుపై ఉండగా కర్నూలు నుంచి నంద్యాలకు వస్తున్న మినీ ట్రాలీ టైర్ పేలడంతో ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో లక్ష్మీరెడ్డితో పాటు ట్రాలీలోని నిజాముద్దీన్ గాయపడ్డాడు. హైవే సిబ్బంది క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తొలగించారు.

గేదెను ఢీకొన్న కారు

పాణ్యం: మండలంలోని నెరవాడ మెట్ట వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన ప్రమాదంలో గేదె తీవ్రంగా గాయపడింది. మహారాష్ట్రకు చెందిన ఎంహెచ్ 44జెడ్ 8757 నంబర్ గల కారు తిరుపతి వెళ్తుండగా రోడ్డు దాటుతున్న బర్రెను ఢీకొంది. సమాచారం తెలుసుకున్న హైవే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. పశుసంచార వాహన సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గేదెకు చికిత్స అందించారు. గేదె తీవ్రంగా గాయపడడంతో తమ జీవనాధారం కోల్పోయామని రైతు గోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. కారు అధిక వేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు.

వృత్తి విద్యతో మెరుగైన ఉపాధి అవకాశాలు


వృత్తి విద్య శిక్షణ పొందుతున్న విద్యార్థులతో అధికారులు

కల్లూరు: వృత్తి విద్యతో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా జీసీడీఓ స్నేహలత అన్నారు. పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు వృత్తి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శనివారం జీసీడీఓతో పాటు జిల్లా వృత్తి విద్యా సమన్వయకర్తలు ప్రతాప్‌రెడ్డి, విక్రమ్ సందర్శించారు. కె. నాగలాపురంలో హెల్త్‌వెల్‌నెస్ సెంటర్, మొబైల్ రిపేరు షాప్స్, బైక్ రిపేరీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. వృత్తి విద్య శిక్షణతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. భవిష్యత్ లక్ష్యాలపై స్పష్టత వస్తుందని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, వృతి విద్యాశిక్షకులు వాణి, శ్రీధర్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గుదలపై అవగాహన


కరపత్రాలను విడుదల చేస్తున్న డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ నిర్మల

ఓర్వకల్లు: కేంద్ర ప్రభుత్వం సవరించిన జీఎస్టీ స్లాబ్‌ల కారణంగా తగ్గిన వస్తువుల ధరలు, ప్రజలకు చేకూరుతున్న లబ్ధిపై శనివారం ఓర్వకల్లు మండల పరిధిలోని వివిధ గ్రామ సచివాలయాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నన్నూరు గ్రామ పంచాయతీ పరిధిలో అసిస్టెంట్ డిప్యూటీ కమిషనర్ నిర్మల పాల్గొన్నారు. ఓర్వకల్లు గ్రామ సచివాలయంలో ఎంపీడీఓ వెంకటరమణయ్య, పంచాయతీ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నివాళి


తోట సుధాకర్ ప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కర్నూలు(రూరల్): ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ జనరల్ సెక్రటరీగా స్వర్గీయ తోట సుధాకర్ ప్రసాద్ అందించిన సేవలు ఎనలేనివని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. శనివారం ఆయన వర్ధంతిని పురస్కరించుకుని ఆర్‌డీఓ కార్యాలయ సమావేశ భవనంలో తోట సుధాకర్ ప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏపీఆర్ఎస్ఎ కర్నూలు డివిజన్ అధ్యక్షుడు వి. రామాంజనేయులు, సెక్రటరీ వేణుగోపాల్ రావు, కల్లూరు, సి.బెళగల్, కోడుమూరు తహసీల్దార్లు కె.అంజనేయులు, వెంకటలక్ష్మి, బి.నాగరాజు, విశాంత్ర తహసీల్దారు మల్లికార్జున, డివిజన్ అధ్యక్షుడు సతీష్, ట్రెజరర్ విష్ణు ప్రసాద్, పౌర సరఫరా శాఖ డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణ, వెలుర్తి డిప్యూటీ తహసీల్దార్ సి.గురుస్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోనా వేంకటేశ్వరుడికి పూజలు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన శ్రీ కోనా వెంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక గ్రామస్తులతో పాటు సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకూర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు కొండపైకి చేరి స్వామిని దర్శించుకున్నారు.

2న ఓపెన్ కబడ్డీ పోటీలు

కర్నూలు(రూరల్): దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని వచ్చేనెల 02న గొందిపర్ల గ్రామంలో స్వామి వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో ఓపెన్ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ శ్రీనువాసులు, ఎంపీటీసీ కె. క్రిష్ణవేణి శనివారం ఒక ప్రకటన లో తెలిపారు. వివరాలకు 9989642989 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు(రూరల్): ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తుండటంతో విద్యుత్‌సంబంధ పరికరాలతో జాగ్రత్తగా ఉండాలని ఏఈ మహమ్మద్ ఇస్మాయల్ సూచించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్షాలు కురిసేటప్పుడు స్టే వైర్, విద్యుత్ లైన్ల కింద ,ట్రాన్స్‌ఫార్మర్లు వద్ద నిలబడరాదన్నారు. ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగి పడి ఉంటే విద్యుత్ సిబ్బందికి లేదా కర్నూలు మండల విద్యుత్ ఏఈ సెల్ నంబర్: 94408 13367కు సమాచారం ఇవ్వాలన్నారు.

వైభవోపేతం..నవరాత్రోత్సవం!


గడివేముల: కాత్యాయినిదేవిగా వాసవీమాత


పాణ్యంలో లలితాదేవిగా ..


పాణ్యం ఏఆర్‌కాలనీలో..


లలితా త్రిపుర సుందరిగా వెంకాయపల్లె ఎల్లమ్మ


గార్గేయపురంలో ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ


సి.బెళగల్‌లో లలితా త్రిపుర సుందరిగా వాసవి మాత


కోడుమూరులో ప్రత్యేక అలంకరణలో వల్లెలాంబాదేవి


కె.నాగలాపురంలో లలితా త్రిపుర సుందరిగా..


సి.బెళగల్ ఈశ్వరాలయంలో అభిషేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కర్నూలు(రూరల్): దసరా శరన్నవరాత్రోత్సవాలు ఊరూరా అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. కోడుమూరు, పాణ్యం నియోజకవర్గాల్లో ఆరోరోజు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. దేవదాయ శాఖ అధ్వర్యంలో వెంకాయపల్లె ఎల్లమ్మను లలిత త్రిపుర సుందర దేవిగా ముస్తాబు చేసి కుంకుమార్చన, శివాభిషేకం, మహా మంగళ హారతి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

- నిడ్జూరు, మునగాలపాడు, ఇ.తాండ్రపాడు, గార్గేయపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గమ్మను భక్తులు దర్శించుకుని తమను చల్లగా చూడాలని మొక్కుకున్నారు.
- **గడివేముల:** స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిశాలలో శనివారం అమ్మవారు కాత్యాయనీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆశ్వయుజ శుద్ధ పంచమి అనురాధ నక్షత్రం నాడు అమ్మవారిని కాత్యాయనీ దేవిగా అలంకరించామని ఆలయ అర్చకులు వసంతలక్ష్మి తెలిపారు. కుంకుమార్చన, మృత్యుంజయ హోమం నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మహిషాసురుని సంహరించి, దేవతల శక్తిని స్వీకరించి, లోకకల్యాణం సాధించిన కాత్యాయనీ దేవి, భక్తుల కోరికలను తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధి చెందారని పేర్కొన్నారు. మహిళలు తమ మనసులోని కోరికలు నెరవేర్చుకోవడానికి ప్రత్యేకంగా కాత్యాయనీ వ్రతం ఆచరించేవారని చెప్పారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొంతల మధుసూదన గుప్తా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.
- **పాణ్యం:** పాణ్యంలో దేవి నవరాత్రుల ఆరో రోజు శనివారం అమ్మవారు లలితాదేవి రూపంలో దర్శనమిచ్చారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో అమ్మవారిని లలితాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అయ్యపురెడ్డి కాలనీలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారు లలితాత్రిపుర సుందరీ అలంకారంలో పూజలందుకున్నారు. అలాగే హైందవశక్తి ఆధ్వర్యంలో అమ్మవారిని లలితాత్రిపుర సుందరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- **సి.బెళగల్:** సి.బెళగల్లోని ఈశ్వరాలయంలో కొలువైన అమ్మవారు, కోమటి వీధిలోని శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి దేవిలు శ్రీ లలితా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చారు. కొత్తకోట, పోలకల్లో గ్రామాల్లో ప్రతిష్టించిన దుర్గాదేవికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు.
- **కోడుమూరు రూరల్:** కోడుమూరులోని కన్యకా పరమేశ్వరి, శ్రీచౌడేశ్వరీదేవి, శ్రీకాళికామాతా, శ్రీరాములమ్మ, శ్రీతులజా భవాని, శ్రీవల్లెలాంబదేవి ఆలయాల్లో శ్రీలలితా త్రిపుర సుందరిగా అమ్మవారు దర్శనమివ్వగా, శ్రీఅంబా భవాని ఆలయంలో వారాహి రూపంలో దర్శనమిచ్చారు. శ్రీవల్లెలాంబదేవి ఆలయంలో అమ్మవారి పల్లకీ సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ సన్నిధిలో తలారి నరసన్న కుమారులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.
- గూడూరు మండలంలోని అమ్మవారి ఆలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. కె.నాగలాపురం గ్రామంలో వెలసిన శ్రీసుంకులా పరమేశ్వరీ దేవి శ్రీలలితా త్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.


కోడుమూరులో శ్రీవల్లెలాంబాదేవి పల్లకీసేవలో ఎస్వీ మోహన్‌రెడ్డి దంపతులు

కోడుమూరు రూరల్: కోడుమూరులోని హంద్రీనది ఒడ్డున వెలసిన శ్రీవల్లెలాంబదేవిని శనివారం రాత్రి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు ఎస్వీ విజయమనోహరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు వారికి కోడుమూరు జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాయర్ ప్రభాకర్, మండల అధ్యక్షుడు రమేష్‌నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. పూజలనంతరం ఎస్వీ మోహన్‌రెడ్డి దంపతులు అమ్మవారి పల్లకీసేవ కార్యక్రమంలో పాల్గొని ఆలయ సన్నిధిలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు రాఘవేంద్రనాయుడు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ


స్మార్ట్ కార్డులు అందజేస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు(రూరల్): స్మార్ట్ రేషన్ కార్డులను శనివారం పంచలింగాల గ్రామంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రేషన్‌కార్డుల స్థానంలో ప్రభుత్వం కొత్తగా స్మార్ట్ కార్డులను తెచ్చినట్లు చెప్పారు. దీని ద్వారా సులభంగా రేషన్ పొందవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకుడు కృష్ణయాదవ్, గ్రామ రెవెన్యూ అధికారి మద్దిలేటి, సిబ్బంది పాల్గొన్నారు.


భూపనపాడులో నీటమునిగిన మిరప పంట


కొనిదేడులో కూలిన మట్టిమిద్దె


పొలాల్లో నిలిచిన నీటిని దిగువకు పంపుతున్న రైతు

వర్షం.. అతలాకుతలం


కొత్తపల్లె గ్రామంలో వర్షం నీరు నిల్వతో దెబ్బతిన్న పత్తి పంట


గోరంట్ల వద్ద ఉల్లిపొలంలో నిలిచిన వాననీరు


రసూళ్లపేట-వడ్డుగండ్లకావేటి వాగు దాటుతున్న గ్రామస్తులు

పాణ్యం: మండలంలో శనివారం 52.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పలు గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జిలపై నీరు ప్రవహిస్తోంది. రసూళ్లపేట-వడ్డుగండ్ల మధ్య కావేటి వాగు ఉధృతంగా ప్రవహించడంతో గ్రామస్తులు నడుములోతు నీటిలో రాకపోకలు సాగించారు. పలువురు ఊర్లోనే ఆగిపోయారు. భూపనపాడు, కౌలూరు, మద్దూరు గ్రామాల్లో మిరప పొలాలు వర్షపు నీటితో నిండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనిదేడు గ్రామానికి చెందిన ప్రకాశమ్మకు చెందిన మట్టిమిద్దె కూలిపోవడంతో ఆమె నిరాశ్రయురాలైంది. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అధిక వర్షాల కారణంగా ప్రజలు మట్టిమిద్దెలలో నివసించవద్దని అధికారులు సూచించారు.

ఎడతెరిపిలేని వర్షం

కోడుమూరు రూరల్: ఆకాశానికి చిల్లు పడిందా అన్న రీతిలో శుక్రవారం తెలవారుజాము నుంచి శనివారం ఉదయం వరకు 24 గంటల పాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి జనజీవనం అస్తవ్యస్తమైంది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చాలా గ్రామాల్లో చేతికొచ్చిన పత్తి, సజ్జ, కొర్ర, వేరుశనగ, ఉల్లి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పత్తి పొలాల్లో భారీగా వాననీరు నిలిచిపోవడంతో పైరు ఎర్రగా మారడంతో పాటు కాయలు కుళ్లిపోతున్నాయి. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఇదిలా ఉంటే గూడూరు మండలంలో శనివారం 59.6మి.మీ వర్షపాతం నమోదైంది.

కలవరపెడుతున్న చెక్‌డ్యామ్


చెక్‌డ్యామ్ నుంచి ప్రవహిస్తున్న వర్షపునీరు


నడివాగులో నీటి ఉధృతి

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం గ్రామం నుంచి ఎన్ కొంతలపాడు గ్రామానికి వెళ్లే పాత దారిలో నడివాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్‌తో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారుల అనాలోచితం, కమిటీ సభ్యుల నిర్వాకంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. ఈ రహదారిలో మధుమోహన్‌రెడ్డి, మెట్లకాటి నాగరాజు, గని ప్రభాకర్ తదితర రైతులు 400-500 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. రైతులందరూ తమ పొలాలకు వెళ్లాలంటే ఈ వాగును దాటాల్సిందే. గతంలో వాగులో వెళ్లాలంటే తీవ్ర అవస్థలు పడేవారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వాటర్ షెడ్ అధికారులు చెక్‌డ్యామ్‌ను అనాలోచిత రహితంగా, రహదారికి 200 మీటర్ల దూరంలో నిర్మించాల్సిన చెక్ డ్యామ్ కేవలం 90-100 మీటర్ల దూరంలో నిర్మించడంతో రైతులకు ఇబ్బందులు అధికమయ్యాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీటి ఉధృతి పెరిగి వాగును దాటడానికి మరింత ఇబ్బందికరంగా మారిందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెక్‌డ్యామ్‌ను రైతులకు ఇబ్బంది లేని విధంగా నిర్మించాలని కోరుతున్నారు.

ఒకే ఈతలో రెండు దూడల జననం



గడివేముల: సాధారణంగా ఆవులు, గేదెలు ఈతకు ఒక దూడకు మాత్రమే జన్మనిస్తాయి. అరుదుగా రెండింటిని ఈనుతాయి. గడివేములకు చెందిన చిక్కొండు నాగన్న అనే రైతుకు మూడు గేదెలు ఉన్నాయి. అందులో ఒక గేదె శనివారం రెండు లేగ దూడలకు జన్మనిచ్చింది. దీంతో నాగన్న సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. రెండు లేగ దూడలు ఆరోగ్యంగా ఉన్నాయని తెలిపాడు. గ్రామస్తులు దూడలను చూసి వెళ్తున్నారు.

జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించాలి

సి.బెళగల్: జీఎస్టీ స్లాబ్‌లలోని మార్పులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ రాణెమ్మ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె జీఎస్టీ అంశాలు, మండల, గ్రామ స్థాయి కమిటీల విధానాలపై అవగాహన కల్పించారు. జీఎస్టీ స్లాబ్ మార్పు ఈనెల 22 నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. సమావేశంలో ఎస్ఐ పరమేష్‌నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోసేనాయక్, డిప్యూటీ ఎంపీడీఓ రాణెమ్మ, ఆయా శాఖల మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు.

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి


పాణ్యంలో బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

పాణ్యం: స్థానిక బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శాంతిరామ్ వైద్య కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ గౌరి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు దీప్తి, తనూజ పాల్గొని పలు సూచనలు చేశారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగం అధిపతి డాక్టర్ ముస్తాక్ పాషా, ప్రొఫెసర్ అఫ్సర్ ఫాతీమా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు, అందులో లభించే పోషకాలు, పోషకాహార లోపం వల్ల కలిగే వ్యాధులపై వివరించారు. రక్తహీనత నివారణకు పౌష్టికాహారం ఎంత ముఖ్యమో తెలియజేశారు. పండ్లు, పప్పులు, పచ్చి కూరగాయలు తప్పనిసరిగా ఆహారంలో చేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శాంతిరామ్ వైద్య కళాశాల సీనియర్ రెసిడెంట్లు మాధురి రెడ్డి, హారిక, చంద్రభాను, పీజీ విద్యార్థులు చంద్రహాస రెడ్డి, శిరీష పాల్గొన్నారు.